సాక్షి చిత్తూరు

మంగళవారం, 7, అక్టోబర్, 2025



అవిశ్వాస తీర్మానంపై నోటీసులు
వడమాలపేట ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సర్వం సిద్ధమైంది. ఈ మేరకు నోటీసులు అందజేశారు. - 8లో



ఇంకెన్ని సార్లు వినతులివ్వాలయ్యా!
చిత్తూరు కలెక్టరేట్‌కు అర్జీదారులు క్యూ కట్టారు. విన్నవించిన సమస్యలపైనే మళ్లీ వినతులిచ్చి నిట్టూర్పులు వెళ్లగక్కారు. - 8లో



పంట పొలాలపై ఆగని ఏనుగుల దాడి
పులిచెర్ల మండలంలో ఏనుగుల దాడులు ఆగనంటున్నాయి. పంట పొలాలపై పడి సర్వనాశనం చేస్తున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

నిర్ణీత గడువులోపు పరిష్కరించాలి



సమస్యలు వింటున్న ఎస్పీ దూడీ

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి వచ్చే ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్ చేయడంతో పాటు నిర్ణీత గడువులోపు పరిష్కారమయ్యేలా చూడాలని చిత్తూరు ఎస్పీ తుషార్ దూడీ అధికారులను ఆదేశించారు. సోమవారం చిత్తూరు నగరంలోని ఏఆర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్య క్రమం నిర్వహించిన ఎస్పీ.. ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. వీటిలో కుటుంబ తగాదా లు, వేధింపులు, మోసాలు, ఇంటి తగాదాలు, భూ తగాదాలు, లావాదేవీలకు సంబంధించిన సమస్యలున్నాయి. పలు ఫిర్యాదులపై అప్పటికప్పుడే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా స్టేషన్ హౌస్ అధికారులతో మాట్లాడారు. ప్రజ ల నుంచి వచ్చే ప్రతీ సమస్యపై విచారణ చేప ట్టి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర రాజు, డీఎస్పీ సాయినాథ్ సైతం ప్రజల నుంచి ఫిర్యాదులను తీసుకున్నారు.

పీసీఆర్ ప్రిన్సిపల్‌కు మెమో

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి టాస్క్‌ఫోర్స్ : విధుల పట్ల అలసత్వం వహించిన పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ మజీద్‌కు ఇంటర్మీడియెట్ అధికారులు మెమో జారీచేశారు. గత నెల 30న సాక్షి దినపత్రికలో అధ్యాపక....ఇది భావ్యమేనా? శీర్షికన వార్త ప్రచురితమైంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో రాజకీయ బ్యానర్లు ఏర్పాటు చేయడంతో పాటు, ఆ బ్యానర్‌లో ప్రిన్సిపల్ ఫొటో ప్రచురించుకోవడం జరిగింది. మరికొన్ని బ్యానర్లలో ఆ కళాశాల విద్యార్థుల అర్ధనగ్న ఫొటోలను ప్రచురించారు. ఈ విషయం పై 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఇంటర్మీడియెట్ అధికారులు ప్రిన్సిపల్‌కు మెమో జారీ చేశారు. ఆయనిచ్చే వివరణ ఆధారంగా ప్రిన్సిపల్ పై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నారు.

12న ఉద్యోగ సంఘం ఎన్నికలు

చిత్తూరు కార్పొరేషన్: ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యవర్గ సభ్యుల ఎన్నికలు ఈనెల 12న నిర్వహించనున్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆ సంఘ ఎన్నికల అధికారి మురళి తెలిపారు. ఈ ఎన్నికలకు రాష్ట్ర కమిటీ తరఫున పెంచలయ్య, మల్లేశ్వరరెడ్డి పరిశీలకులుగా వ్యవహరించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఏపీ పంచాయతీ రాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా శాఖ, అన్ని సమితులకు సంబంధించిన సభ్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఏ మాత్రం తగ్గలేదు!

జీఎస్టీ భారాన్ని కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. ఈనెల 22 నుంచి కొత్త స్లాబులను అమల్లోకి తెచ్చింది. ముఖ్యంగా నిత్యావసరాలు, వాహనాలు, ఎలక్ట్రికల్ వస్తువులు, గృహోపకరణాలతోపాటు, ప్రజారోగ్యం దృష్ట్యా పలు మందులపైనా జీఎస్టీని కుదించింది. అయితే మెడికల్ షాపుల్లో జీఎస్టీ తగ్గింపు బోర్డులు కనిపించని పరిస్థితి నెలకొంది. పాత ధరలతోనే కొనుగోలు చేసి జేబులకు చిల్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. దీనిపై ఏ ఒక్కరూ నోరుమెదపకపోగా.. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కూడా అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- మందులు, మాత్రల విక్రయాల్లో కనిపించని జీఎస్టీ తగ్గింపు
- పాత ధరలతోనే అమ్మకాలు
- మెడికల్ షాపుల్లో కనిపించని తగ్గింపు బోర్డులు
- తనిఖీ చేయని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు



కాణిపాకం: జిల్లాలో దాదాపు 1,500 మెడికల్ స్టోర్లు, 200పైగా హోల్ సేల్ షాపులున్నాయి. వీటి ద్వారా రోజువారీ రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు వ్యాపారం జరుగుతోంది. ఫలితంగా ట్యాక్స్ ఎగ్గొట్టాలని చాలామంది మెడిసిన్ కొనుగోలుపై బిల్లులు ఇవ్వడం లేదు. బిల్లు అడిగితే ఇస్తామని చెప్పి జాప్యం చేస్తున్నారు. కొనుగోలు ధర ఒకటి, బిల్లులో నమోదు చేసే ధర మరొకటిగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక మందుల ప్యాకెట్లపై గడువు తేదీలు కూడా సరిగా కనిపించక పోవడం ఆందోళన కలిగిస్తోంది.

బేరాల్లేవ్!

చాలా ప్రైవేట్ ఆస్పత్రుల్లో సొంతంగా మెడికల్ షాపులు నడుపుతూ రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఆస్పత్రిలో చేరిన రోగులు అక్కడే మందులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. వైద్యులు సైతం తమ షాపుల్లో లభించే మందులనే రాయడం గమనార్హం. ఈ షాపుల్లో మందులపై ఎలాంటి తగ్గింపులు లేకుండా ఎంఆర్‌పీకే విక్రయిస్తున్నారు.

పాత మందులంటూ బూచీ

జీఎస్టీ తగ్గింపు కారణంగా క్యాన్సర్, గుండె జబ్బులు, దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన అత్యవసర మందుల ధరలు తగ్గుతాయనే ప్రచారం ఆర్భాటంగానే మిగిలిపోయింది. మందుల షాపుల యాజమా నులు పాత స్టాక్ పేరు చెప్పి ఆ ధరలకే విక్రయిస్తున్నారు. పాత స్టాక్ పూర్తయిన తర్వాతే కొత్త ధరలు అమలవుతాయని బుకాయి స్తున్నారు. పాత స్టాక్ నిల్వలపై కొత్త ధరలు వర్తింపజేయదానికి నిబంధనలు ఉన్నా వాటిని అమలు చేయడం లేదు. ఈ విషయా న్ని సంబంధిత డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు లైట్ తీసుకున్నట్టు తెలుస్తోంది.

నిబంధనలు పాటించరే

మందులపై జీఎస్టీ తగ్గింపు ధర ఈనెల 22 నుంచి అమలులోకి వచ్చింది. సవరించిన ధరలతో మెడికల్ షాపుల్లో బోర్డులు పెట్టాలి. ఎక్కడా ఈ బోర్డులు కనపించడం లేదు. దుకాణదారులు నిబంధనలు పాటించడం లేదు. అధికారుల వత్తాసు ఉందని జీఎస్టీకి తూట్లు పొడుస్తున్నారు. ప్రజలను మందులు, మాత్రలతో మాయ చేస్తున్నారు. జీఎస్టీ తగ్గింపు ధరలు అమలుపై నిఘా కొరవడింది. ఔషధ నియంత్రణ శాఖ పర్యవేక్షణలో ఎక్కడా తనిఖీలు గానీ, సోదాలు గానీ చేసినట్లు కనిపించడం లేదు. ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీఎస్టీ తగ్గింపు అమలయ్యేలా చూడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

తగ్గింపు ధరలు అమలు కావాలి



ఇప్పుడున్న రోజుల్లో తిండికంటే ముందు ముఖ్యమైనవి మందులు, మాత్రలు. ప్రస్తుత పరిస్థితుల్లో గుండె జబ్బులు, క్యాన్సర్, షుగర్, బీపీ వంటి వ్యాధులు అధికంగా ఉన్నాయి. మందులు, మాత్రలకు పేద కుటుంబాల వారు కూడా నెల వారీగా వేలల్లో ఖర్చు చేస్తున్నారు. జీఎస్టీ ఊరటతో కాస్త తగ్గుతుందని అనుకుంటే..ఇంకా మందుల దుకాణాల్లో పాత ధరలే అమలవుతున్నాయి. అధికారులు స్పందించి జీఎస్టీ తగ్గింపు వర్తించేలా చూడాలి.

– రాజారత్నంరెడ్డి, ప్రజాహిత సేవా సంస్థ అధ్యక్షుడు, చిత్తూరు

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 83,412మంది స్వామివారిని దర్శించుకున్నారు. 33,058 మంది భక్తులు తలనీలాలు అర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.89 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

8 నుంచి సంచార ఆధార్ శిబిరాలు

చిత్తూరు కార్పొరేషన్ : చిత్తూరు నగరంలో ఈనెల 8వ తేదీ నుంచి సంచార ఆధార్ శిబిరాలను నిర్వహించనున్నట్లు తపాలా శాఖ చిత్తూరు డివిజన్ సూపరింటెండెంట్ లక్ష్మన్న తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 8న నగరంలోని సంసిద్ధ్ క్యాంఫోర్డ్ పాఠశాల (గంగనపల్లి), బీవీ రెడ్డి పాఠశాలలో, ఈ నెల 9న సంతపేటలోని రెయిన్‌బో స్కూల్, బృందావన్ పాఠశాలల్లో, 10న కొంగారెడ్డిపల్లిలోని న్యూయార్క్, కేశవరెడ్డి (న్యూ బాలాజీకాలనీ) పాఠశాలల్లో సంచార ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నట్టు ఆయన వెల్లడించారు.

ఎంపీపీగా నాగినేని దుర్గాదేవి బాధ్యతల స్వీకరణ



మాజీ మంత్రి ఆర్కే రోజా సమక్షంలో ఎంపీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న దుర్గాదేవి



మాజీ మంత్రి, నూతన ఎంపీపీతో పార్టీ నేతలు

- ఆశీస్సులు అందించిన మాజీ మంత్రి ఆర్కే రోజా

నింద్ర : నింద్ర ఎంపీపీగా వైస్ ఎంపీపీ దుర్గాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరలో ఎంపీపీగా ఉన్న దీప వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసిన విషయం విదితమే. ఎంపీపీకి రాజీనామా సమర్పించే హక్కు ఉన్నందున ఆమె రాజీనామా ఆమోదించి గెజిట్ 14/2021లోని నిబంధనల మేరకు వైస్ ఎంపీపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నాగినేని దుర్గాదేవికి ఎంపీపీగా బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ సమక్షంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి ఆర్కేరోజా హాజరై నూతన ఎంపీపీకి శుభాకాంక్షలతో పాటు ఆశీస్సులు అందజేశారు. ఎంపీపీ దుర్గ, పార్టీ నేతలు మాజీ మంత్రిని దుశ్శాలువలతో సత్కరించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ పదవులను సద్వినియోగం చేసుకొని ప్రజలకు మంచి చేయాలని, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని సూచించారు. పదవికి, పార్టీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మాజీ ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, ఎంపీటీసీలు విజేష్, రమ్య, కో–ఆప్షన్ సభ్యుడు అనిల్, జెడ్పీటీసీ పరంధామన్, రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి శ్యామ్‌లాల్, విజయపురం, నింద్ర మండల పార్టీ అధ్యక్షుడు వేణు రాజు, శివరాజు, విజయపురం ఎంపీపీ మంజు బాలాజీ, సర్పంచ్‌లు బాబురెడ్డి, చంద్రబాబు నాయకులు మునికృష్ణారెడ్డి, శివయ్య, శివరాజు, రామచంద్రయ్య, మహేష్, చార్లీ, రాము పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీపై అవగాహన కల్పించండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో తప్పనిసరిగా సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఈవో వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభు త్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై విద్యారంగంలో ఏ వస్తువులపై ధరలు తగ్గుతాయో అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 7న విద్యార్థులకు పాఠశాలల్లో అవగాహన పోటీలు నిర్వహించాలన్నారు. గెలుపొందే విద్యార్థులకు మూడు బహుమతు లు అందజేసి సర్టిఫికెట్లు పంపిణీ చేయాలని చెప్పారు. ఈ పోటీలు అమలు చేసేలా డీవైఈవోలు, ఎంఈవోలు, హెచ్ఎంలు చర్యలు చేపట్టాలని డీఈవో ఆదేశించారు.

తప్పు చేసేవారికి శిక్ష ఖాయం



డిజిటల్ డైరీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం: అధికారం అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడేవారికి శిక్ష తప్పదని ఎమ్మెల్సీ భరత్ హెచ్చరించారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ డిజిటల్ డైరీ వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి నేతలు అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమాలకు పాల్పడుతున్నారని, భవిష్యత్‌లో ఇలాంటి వారికి చట్టం శిక్షిస్తుందని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్‌సీపీ కార్యకర్త కోసం డిజిటల్ డైరీతో పాటు క్యూఆర్ కోడ్ సిస్టమ్‌ను ప్రారంభించినట్టు వెల్లడించారు. దీని ద్వారా కార్యకర్తలు కూటమి ప్రభుత్వంతో జరుగుతున్న అక్రమాలు గురించి అధిష్టానం దృష్టి తీసుకెళ్లవచ్చన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్వారీ.. వసూళ్ల సవారీ!

- ముగిసిన రాయల్టీ టెండర్ల గడువు
- మైనింగ్‌శాఖకు రాయల్టీ వసూళ్ల పగ్గాలు
- జోరందుకున్న దందా
- యూనియన్ పేరుతో రెచ్చిపోతున్న అధికార పార్టీ నేతలు
- కొమ్ముకాస్తున్న అధికారులు
- కొలిక్కిరాని కొత్త టెండర్ల ప్రక్రియ

సాక్షి టాస్క్‌ఫోర్స్: క్వారీలపై వసూల్ రాజాలు కన్నేశారు. రాయల్టీ పేరుతో దోచుకోవడం ప్రారంభించారు. దొంగ బిల్లులతో రెచ్చిపోతున్నారు. కాపు కాచి కాసులు కొల్లగొడుతున్నారు. యూనియన్ పేరుతో అధికారాన్ని అడ్డుపెడుతున్నారు. దీనికితోడు అధికారిక రాయల్టీ వసూళ్ల ప్రక్రియ ముగిసింది. ఆ శాఖకు వసూళ్ల పగ్గాలు దక్కాయి. దీంతో అడ్డూ అదుపు లేకుండా మాఫియా వసూళ్లకు తెగబడుతోంది. ఈ అక్రమాలకు ఆ శాఖలోని కొందరు కొమ్ము కాస్తూరనే విమర్శలు వస్తున్నాయి.

ఇది ఇంతేనా?

బంగారుపాళ్యం మండలం, పాలేరు ప్రాంతంలో గ్రానైట్ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. విలువైనా ఖనిజం బయట పడడంతో జోరుగా తవ్వేస్తున్నారు. ఇదంతా ఓ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో సాగుతోంది. అనుమతి లేకుండా ఈ క్వారీని కొనసాగిస్తున్నారు. ఆ విషయం సంబంధిత శాఖ అధికారులకు కూడా తెలుసు. నేషనల్ హైవే రోడ్డు నుంచి చూసినా ఈ అక్రమ క్వారీ స్పష్టంగా కనిపిస్తుంది. దీనిపై «సాక్షి» దినపత్రికలో వరుసగా కథనాలొచ్చాయి. వీటిపై ఆ శాఖ అధికారులు స్పందించినట్టు నటించి మిన్నకుండిపోవడం విమర్శలకు తావిస్తోంది.

దోచేద్దాం..దాచేద్దాం!

కూటమి అధికారంలోకి రావడంతో అందరి కన్నూ ఆదాయంపై పడింది. తొలుత వర్కులపై పడ్డారు. అవి పార్టీలో పట్టున్న నాయకులే దక్కించుకోవడంతో అక్రమ మార్గాలను ఎంచుకున్నారు. ఇందులో ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న క్వారీ తవ్వకాలపై కన్నేశారు. పార్టీ కోసం కష్టపడిన వారు, సీనియర్లందరూ అక్రమ మార్గాలను ఎంచుకున్నారు. ప్రధానంగా కూటమిలో కొత్త ముఖాలు మాత్రమే చక్రం తిప్పుతున్నాయి. వీరంతా పార్టీ సిద్ధాంతాలను పక్కన పెట్టి అక్రమ సంపాదనలో మునిగితేలుతున్నారు. ముఖ్యంగా మైనింగ్ మాఫియాలోకి దిగి కోట్లకు పడగలెత్తుతున్నారు.



బంగారుపాళ్యంలో అక్రమ క్వారీ

కొండలు కరిగించి.. కోట్లు మింగేసి

కూటమి అధికారంలోకి వచ్చాక కొత్తగా తెరపై కనిపిస్తున్న కూటమి నేతలు మైనింగ్ మత్తులో పడిపోయారు. స్థానిక ప్రజాప్రతినిధులను బుట్టలో వేసుకుని అక్రమ క్వారీలతో కోట్లు కొల్లగొడుతున్నారు. సమీప గ్రామాల ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. ఇంతజరుగుతున్నా ఏ ఒక్కరూ అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

దొంగబిల్లుల సంగతేంటి?

రాయల్టీ అధికారిక వసూళ్లతోపాటు కూటమి నేతలు బెదిరించి యూనియన్ పేరుతో దొంగ బిల్లులు ఇస్తూ.. కాసులు దోచేస్తున్నారు. నెలనెలా కోట్లు కొల్లగొడుతూ గుట్టు చప్పుడు కాకుండా దొంగ బిల్లుల వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. ఈ వ్యవహారం బయటకు రావడంతో దొంగ బిల్లులను నొక్కి పెట్టే ప్రయత్నం చేశారు. ఇది అధిష్టానం వరకు వెళ్లడంతో పార్టీలోని సీనియర్లతో పాటు వివిధ శాఖల అధికారులు సైతం దొంగ బిల్లుల రారాజుపై ఏళ్లు ఎక్కుపెట్టారు. దీంతో కొంతమందికి గట్టిగా అక్షింతలు పడ్డాయి. ఇంతలో అధికారిక రాయల్టీ వసూళ్ల ప్రక్రియ ముగిసింది.

పట్టుకుంటారా?

అక్రమ క్వారీలు, తరలింపులు దర్జాగా సాగుతున్నా మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాయల్టీ వసూళ్ల పగ్గాలు ఆ శాఖకు అప్పగించినా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వెళ్లి పోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. అక్రమ క్వారీలు, తరలింపులను కట్టడి చేసేందుకు సాహసం చేయడం లేదని, మైనింగ్ మాఫియాకు భయపడి వారు మిన్నకుండి పోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. చిత్తూరు కార్యాలయంలోని ఓ అధికారి సహకారం, ఆయనిచ్చే సలహాలతోనే అక్రమ క్వారీల వ్యవహారం పుంజుకుంటోందని పలువురు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలోని బడానేతల పేర్లు చెప్పుకుంటూ ఈ దందాకు ఆజ్యం పోస్తున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

అడ్డూఅదుపూ లేదు

ఇన్నాళ్లు రాయల్టీ వసూళ్లు ఓ ప్రైవేటు చేతిలో ఉండేది. ఈ నెల 1వ తేదీతో ఆ ప్రైవేటు సంస్థకు వసూళ్ల గడువు ముగిసింది. ఇప్పుడు కొత్త టెండర్ల ప్రక్రియ నడుస్తోంది. ఈ టెండర్ దక్కించుకోవడానికి కొత్త సంస్థ గట్టిగా పట్టుబడుతోంది. అధిష్టానం వద్ద పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇక కొత్త టెండర్ల ప్రక్రియ కొలిక్కి రాకపోవడంతో దొంగ బిల్లుల రాజాలు రూటు మార్చారు. బిల్లులు లేకుండా గ్రానైట్ తరలింపునకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. దగ్గరుండి అక్రమ గ్రానైట్ తరలింపును నడిపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఈ దందాతో వసూల్ రాజాలకు మాత్రం కోట్లు కుమ్మరిస్తోంది. ఇందుకు యాదమరి, పూతలపట్టు, పెనుమూరు మండలాలకు సంబంధించిన వ్యక్తులకు బాధ్యతలు అప్పగించినట్లు సొంత పార్టీ నేతలే చెబుతున్నారు.

స్వచ్ఛతే మన లక్ష్యం



స్వచ్ఛ అవార్డులు అందజేస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

- 55 మందికి జిల్లా స్థాయి స్వచ్ఛ అవార్డులు

చిత్తూరు కలెక్టరేట్ : స్వచ్ఛతలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని నాగయ్య కళా క్షేత్రంలో జిల్లా స్థాయి స్వచ్ఛత అవార్డుల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛత, పరిశుభ్రత పైన ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. స్వచ్ఛత కార్యక్రమంలో స్వచ్ఛత కార్పొరేషన్ జిల్లాకు రాష్ట్ర స్థాయిలో 7 అవార్డులు, జిల్లా స్థాయిలో 55 అవార్డులు అందజేసినట్టు వెల్లడించారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరిన్ని అవార్డులను కైవసం చేసుకునేలా ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ 2026 నాటికి జిల్లాకు 100 స్వచ్ఛత అవార్డులు తెప్పించాలన్నారు. అనంతరం విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేతుల మీదుగా జిల్లా స్థాయి స్వచ్ఛ అవార్డులను అందజేశారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, మేయర్ అముద, చుడా చైర్మన్ కటారి హేమలత, డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆగని ఏనుగుల దాడి



బాలిరెడ్డిగారిపల్లెలో నాశనమైన వరి

పులిచెర్ల(కల్లూరు) : మండలంలో పంట పొలాలపై ఏనుగుల దాడులు ఆగడంలేదు. ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట ఏనుగులు పొలాల్లోకి వచ్చి పంటలను నాశనం చేస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. సోమవారం తెల్లవారు జామున బాలిరెడ్డిగారిపల్లెకు చెందిన సురేంద్రరెడ్డి వరి పంట, ప్రభాకర్‌రెడ్డి, రుక్మణమ్మకు చెందిన వేరుశనగ పంటను తొక్కి నాశనం చేశాయి. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను వేరే ప్రాంతాలకు తరలించడానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వరసిద్ధుని సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



స్వామి చిత్రపటం అందజేస్తున్న అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని సోమవారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు చేయగా.. ఏఈవో రవీంద్రబాబు స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

ఇంకెన్ని సార్లు వినతులివ్వాలయ్యా!

'ఇంకెన్ని సార్లు వినతులివ్వాలయ్యా' అంటూ అర్జీదారులు ఉన్నతాధికారుల ఎదుట మొరపెట్టుకున్నారు. కరుణ చూపి తమ సమస్యలు పరిష్కరించండంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి క్యూ కట్టారు. వివిధ సమస్యలపై 274 అర్జీలు అందించినట్టు కలెక్టరేట్ అధికారులు పేర్కొన్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడేల్, డీఆర్‌వో మోహన్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ కుసుమకుమారి, ఏవో వాసుదేవన్‌లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. – చిత్తూరు కలెక్టరేట్

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు క్యూ కట్టిన అర్జీదారులు

- వివిధ సమస్యలపై 274 వినతులు
- పరిష్కరించాలంటూ వేడుకోలు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సమస్యలను వివరిస్తున్న అర్జీదారులు

పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయండి



రైతులు రెడ్డెమ్మ, రేణుక

పట్టాదారు పాసు పుస్తకాలను మంజూరు చేయాలని పెద్దపంజాణి మండలం, కొత్త బూరుగపల్లి ఎస్టీ కాలనీకి చెందిన రెడ్డెమ్మ, రేణుక తదితరులు కోరారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ సర్వే నం.88/10లో ఉన్న వ్యవసాయ భూమిలో గత 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నామన్నారు. అధికారులు సర్వే చేసి తమకు పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

• సీసీ రోడ్డు అదనంగా వేయించండి



అదనంగా సీసీ రోడ్డు వేయించాలని కోరుతున్న గ్రామస్తులు

తమ గ్రామంలో సీసీ రోడ్డు అదనంగా వేయించాలని పాలసముద్రం మండలం, దీనబంధుపురం ఆది ఆంధ్రవాడ వాసులు శాంతమ్మ, జ్యోతి కోరారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలో సీసీ రోడ్డు వేశారని, ఇది రాకపోకలకు ఏ మాత్రం సరిపోని విధంగా ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న సీసీ రోడ్డును 500 మీటర్లు అదనంగా పెంచి వేయాలని కోరారు.

భూమి ఆక్రమించుకున్నారయ్యా!



న్యాయం చేయాలని కోరుతున్న రైతు చలపతి

తమ భూమిని ఆక్రమించుకున్నారని శాంతిపురం మండలం, రాళ్లబుదుగూరు గ్రామానికి చెందిన చలపతి వాపోయారు. ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో సర్వే నం.206లో 2.40 సెంట్లు, 207లో 0.64 సెంట్లు భూమి ఉందన్నారు. పూర్వీకుల నుంచి వస్తున్న భూమిని కర్ణాటకకు చెందిన వ్యక్తులు ఆక్రమించుకున్నారన్నారు. ఆక్రమించుకోవడంతో పాటు దొంగ పట్టాలను సృష్టించుకున్నట్లు తెలిపారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

వారికి న్యాయవాదులు సహకరించకూడదు



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

మైనర్ బాలికలపై గ్యాంగ్‌రేప్, మహిళలపై అత్యాచారాలు చేస్తున్న కామాంధులకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సహకరించకూడదని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు కోరారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. మైనర్ బాలికలపై గ్యాంగ్ రేప్, మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్న దుర్మార్గపు కామాంధులకు కఠిన శిక్షలు విధించాలన్నారు. ఆ నిందితులకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సహకరించకూడదన్నారు. గత ఐదు రోజులకు ముందు సీఎం సొంత జిల్లా పెనుమూరు క్రాస్ వద్ద అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన పార్కులో మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్ చేసిన ముగ్గురు కామాంధులకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సహాయం చేయకూడదని కోరారు.

టెంపో ఢీకొని వృద్ధురాలి మృతి



మృతురాలు రాజమ్మ

బంగారుపాళెం: మండలంలోని కేజీ సత్రం వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై సోమవారం టెంపో ఢీకొనడంతో వృద్ధురాలు మృతి చెందింది. వివరాలు.. మండలంలోని కుమ్మరపల్లెకు చెందిన మునస్వామి భార్య రాజమ్మ(67) చిత్తూరు వెళ్తేందుకు కేజీ సత్రం గ్రామానికి వచ్చింది. రోడ్డు దాటుతున్న క్రమంలో పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న టెంపో ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో రాజమ్మ మృతి చెందింది. మృతురాలు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు మహర్షి వాల్మీకి జయంతి

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 7 వ తేదీన మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటలకు మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు, అధికారులు హాజరుకావాలని కలెక్టర్ కోరారు.

పేదల భూ సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న వాడ గంగరాజు

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా వ్యాప్తంగా పేదల భూ సమస్యలపై సీపీఎం పోరాటం చేసేందుకు నిర్ణయించినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పేదలు భూ సమస్యలు పరిష్కారం అవ్వక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని, వాటి పట్ల రెవెన్యూ అధికారులు చొరవ చూపాలన్నారు. మామిడి రైతులకు ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం రూ.8ను పరిశ్రమల నిర్వాహకులు చెల్లించడం లేదన్నారు. పరిశ్రమల్లో, ఇతర చోట్ల పనిచేసే వారికి 13 గంటల పనివిధానాన్ని అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం దారుణమన్నారు. సమావేశంలో సీపీఎం పార్టీ జిల్లా నాయకులు సురేంద్ర, గిరిధర్ గుప్తా పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌కు పనులు..కర్షకులకు కన్నీళ్లు!

- కాంట్రాక్టు పని కోసం చెరువుకు గండి



మొరవ పక్కన కాలువ తవ్వి నీటి విడుదల



సోగడబళ్ల పెద్ద చెరువు నుంచి వృథాగా పోతున్న నీరు

శాంతిపురం: కర్ణాటక ప్రాంతంలో విస్తారంగా కురిసిన వర్షాలతో మండంలోనే పెద్ద దైన సోగడబళ్ల పెద్ద చెరువుకు చేరిన నీటిని వృథాగా కిందికి వదిలేశారు. పంచాయతీ కేంద్రమైన చెంగుబళ్ల గ్రామానికి పక్కనే ఉన్న ఈ చెరువు గట్టు అభివృద్ధి పనులు చేస్తున్నారు. ఇందులో భాగంగా మొరవ పనులు కూడా చేయాల్సి ఉంది. వర్షపు నీటితో ఈ పనులకు ఇబ్బంది కలుగుతుందని భావించిన కాంట్రాక్టర్ మొరవ పక్కనే దాదాపు ఐదు అడుగుల లోతుతో కాలువ తీసి నీటిని వృథాగా వదిలేశారని స్థానికులు చెబుతున్నారు. జల సంరక్షణ పనుల కోసం ప్రజాధనాన్ని ఖర్చుచేస్తుంటే పొరుగు రాష్ట్రం నుంచి వచ్చిన నీటిని వినియోగించుకోలేని పరిస్థితి దాపురించిందని గ్రామస్తులు వాపోయారు. అధికారులు స్పందించి నీటి వృథాకు కారణమైన కాంట్రాక్టర్లు, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయకట్టుదార్లు, సమీప గ్రామాల రైతులు కోరుతున్నారు. కాంట్రాక్టర్లకు పనులు, బిల్లుల కోసం ఈ ప్రాంత రైతుల ప్రయోజనాలను విస్మరించారని స్థానిక సర్పంచ్ పూలకుంట భాస్కర్ విమర్శించారు.

ట్రాక్టర్ల దొంగలు అరెస్ట్



ట్రాక్టర్లతో పాటు నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గుడిపాల: రెండు ట్రాక్టర్లను దొంగతనం చేసిన నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు వాటిని స్వాధీనం చేసుకున్నట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన కథనం.. గుడిపాల మండలం, పశుమంద దళితవాడకు చెందిన వినాయకం ట్రాక్టర్‌ను జూలై 21వ తేదీ రాత్రి దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. అలాగే సెప్టెంబర్ 30వ తేదీన కృష్ణజమ్మాపురం గ్రామానికి చెందిన చిట్టిబాబునాయుడు ట్రాక్టర్‌ను కూడా ఎత్తుకెళ్లారు. వీటిపై కేసు నమోదైంది. చిత్తూరు ఎస్పీ ఆదేశాల మేరకు దొంగతనం జరిగిన ప్రదేశం నుంచి సీసీటీవీ కెమెరాలను పరిశీలించగా ట్రాక్టర్లు రెండూ తమిళనాడు వైపుగా వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు తమిళనాడు మేల్పాడి దారిలో నిఘా పెట్టారు. సోమవారం చలిచీమలపల్లె వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కమ్మతిమ్మాపల్లె వైపు నుంచి మేల్పాడి వైపుగా రెండు ట్రాక్టర్లు.. వాటి ముందు ఒక మోటార్ సైకిల్‌లో వస్తూ ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులు వారిని చాకచక్యంగా పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో తమిళనాడు రాష్ట్రం, వేలూరు జిల్లా, కాట్పాడి తాలూకా, కోదండ రామాపురం గ్రామానికి చెందిన బద్రి అలియాస్ సాయికుమార్(26), కార్తీక్(19), రాజమణి(47) ఉన్నారు. వారి నుంచి రెండు ట్రాక్టర్ల తోపాటు మరో రెండు ద్విచక్ర వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. వీటి విలువ రూ.18 లక్షలు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు వారు పేర్కొన్నారు.

గుర్తింపు లేదా?



ధర్నాలో వైద్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కరోనా వంటి విపత్తులను సైతం లెక్క చేయకుండా సేవ చేస్తున్న వైద్య వృత్తికి తగిన గుర్తింపు లేదని పీహెచ్‌సీ వైద్య సంఘ నాయకురాలు శిరీష అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. సమ్మెలో భాగంగా తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. ఏళ్ల తరబడి వెట్టిచాకిరీ చేస్తున్నా.. పీహెచ్‌సీ వైద్యులకు పదోన్నతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోరాడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వాపోయారు. ఇక పీజీ కోటాను 10 శాతం తగ్గించడం దారుణమన్నారు. ఇలాగైతే పీహెచ్‌సీ వైద్య వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందని గుర్తు చేశారు. పలుమార్లు దీనిపై రాష్ట్ర పాలకులకు విన్నవించినా ఎలాంటి మార్పులు లేవని వాపోయారు. వైద్యులు జానకీరావు, ఎల్లయ్య పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట–పలమనేరు రోడ్డులోని కోగిలేరు సమీపంలో సోమవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. చౌడేపల్లి మండలం దుర్గసముద్రం పంచాయతీ బుటకపల్లికి చెందిన జాఫర్(19) పలమనేరు వచ్చాడు. సొంత పనులు ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. అదే సమయంలో బెంగళూరు సిటీ మేడహళ్లికి చెందిన హరీష్ పెద్దపంజాణి మండలం సుద్దగుండ్లపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చి బెంగళూరుకు తిరుగు ప్రయాణమయ్యాడు. కోగిలేరు సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో జాఫర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు తపాల సేవలపై అవగాహన

చిత్తూరు కార్పొరేషన్ : జాతీయ తపాల వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం తపాల సేవలపై అవగాహన కల్పించనున్నట్లు ఆ శాఖ డివిజన్ సూపరింటెండెంట్ లక్ష్మన్న తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ తపాల వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం తపాల సేవలపై అవగాహన, ఈ నెల 8న డాయి ఆఖర్ శీర్షికతో ఉత్తరాలు, క్విజ్ పోటీలు, 9న మాతృమూర్తి పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం, 10న ఖాతాదారులకు పోస్టాఫీసు సేవలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఫ్యాను పాటకు డ్యాన్స్ వేస్తే ఎస్ఐ కొట్టారు



మాట్లాడుతున్న బాధితుడు, గ్రామస్తులు, దళిత నేతలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో ఖాకీలు కూటమి పార్టీల కార్యకర్తల్లా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఓ పాటకు డ్యాన్స్ వేశాడనే నెపంతో గుడిపాల మండలంలో ఓ బాలుడిపై ఎస్ఐ దాడికి పాల్పడిన ఘటన వెలుగుచూసింది. తాను వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ పాటకు డ్యాన్స్ వేస్తే టీడీపీ నేతల కుట్రతో ఎస్ఐ కక్షపూరితంగా తనపై దాడి చేసినట్లు గుడిపాల మండలం 189 కొత్తపల్లికి చెందిన యశ్వంత్ అనే ఇంటర్మీడియట్ విద్యార్థి ఆరోపించారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం దళిత నేతలు, గ్రామస్తులతో కలసి మీడియాతో మాట్లాడాడు. గతనెలలో జరిగిన వినాయక నిమజ్జన వేడుకలో అందరితో పాటు తాను కూడా పాల్గొన్నానన్నాడు. అందులో భాగంగా వైఎస్సార్‌సీపీ పాటకు డాన్స్ చేశానని తెలిపాడు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన గుడిపాల ఎస్ఐ తనను పిలిచి అకారణంగా కొట్టి హింసించారని ఆరోపించాడు. కొట్టిన విషయాన్ని నాయకుల వద్దకు వెళ్లి చెబితే.. భవిష్యత్తు లేకుండా చేస్తానని ఎస్ఐ బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆపై డీజేకు పర్మిషన్ లేదని కేసులు నమోదు చేశారన్నాడు. దీని వెనుక టీడీపీ నేతల కుట్ర ఉందని వివరించాడు. ఈ విషయమై ఎస్పీ స్పందించి తనకు న్యాయం చేయాలని, దాడిచేసిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కోరాడు. దళిత నేత గద్దం విజయ్ మాట్లాడుతూ.. పాటకు డాన్స్ వేస్తే బాలుడి చెంపపై, చేతులు వాచేలా కొట్టడం సరికాదని మండిపడ్డారు. బాలుడికి న్యాయం జరగకపోతే మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

అవిశ్వాస తీర్మానంపై నోటీసులు



సీఈఓకు నోటీసు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యులు

వడమాలపేట (పుత్తూరు): వడమాలపేట ఎంపీపీ విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సోమవారం చిత్తూరు సీఈఓ, వడమాలపేట ఎంపీడీఓకు వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు నోటీసులు అందజేశారు. మండల అభివృద్ధికి ఎంపీపీ సహకరించడం లేదని, సభ్యుల విశ్వాసాన్ని కోల్పోయారని, ఫలితంగా అవిశ్వాస తీర్మానం పెట్టాల్సిన అవసరం ఏర్పడిందని నోటీసులో పేర్కొన్నారు. చట్టం ప్రకారం నోటీసు అందుకున్న 15 రోజుల్లోపు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, అవిశ్వాస తీర్మానం నిర్వహించాలని సూచించారు. నోటీసులు అందజేసిన వారిలో వైస్ ఎంపీపీలు డీ.ఉపేంద్ర, వీ.లోకేష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఎ.రవి, ఎ.ప్రతిమ, టి.పుష్పలత, ఇ.కనకమ్మ ఉన్నారు.

తిరుపతిలో కత్తితో రౌడీషీటర్ హల్‌చల్



నిందితులను కోర్టుకు తీసుకెళుతున్న పోలీసులు

తిరుపతి క్రైమ్: తిరుపతిలోని విక్టరీ వైన్స్ వద్ద ఆదివారం రాత్రి ఓ యువకుడు కత్తితో హల్‌చల్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. టీవీఎస్ సర్కిల్ వద్ద ఉన్న ఓ వైన్ షాప్ ముందు వీరంగం సృష్టించారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు.. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తన బృందంతో ఆ యువకుడిని, అతనితో పాటు ఉన్న మరో యువకుడిని వీడియో ఆధారంగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ కత్తితో హల్‌చల్ చేసిన వ్యక్తి రౌడీషీటర్ ఫిరోజ్, పక్కన ఉన్న వ్యక్తి సయ్యద్ బాషాగా గుర్తించామన్నారు. ప్రధాన నిందితుడు ఫిరోజ్ గతంలో కేసుల్లో నేరస్తుడనీ, అతను చాలా కాలంగా పరారీలో ఉన్నాడని తెలిపారు. వారిద్దరిపై కేసు నమోదు చేశామని తెలిపారు. పూర్తి స్థాయిలో విచారించామని..వారిపై ఇప్పటికే పలు కేసులు కూడా ఉన్నాయని.. తెలిపారు.

నగరంలో నడిపించుకుంటూ కోర్టుకు

రెండు రోజుల క్రితం చిత్తూరులో లైంగిక దాడి కేసులో నిందితులను పోలీసులు కోర్టు వరకు నడిపించుకుని తీసుకెళ్లారు. అదే తరహాలో తిరుపతిలో కత్తితో హల్‌చల్ చేసిన నిందితులు ఫిరోజ్, సయ్యద్ బాషాలను తిరుపతి పోలీసులు సోమవారం రాత్రి ఈస్ట్ పోలీస్ స్టేషన్ నుంచి నడిపించుకుంటూ కోర్టుకు తీసుకెళ్లారు. న్యాయమూర్తి ముందు హాజరుపరచి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.